ఇష్టమైన సబ్జెక్ట్ ఏది..?
ఈ ప్రశ్న అడిగితే దాదాపు
95 శాతం మంది విద్యార్థులు
ఆ సబ్జెక్ట్ జోలికే వెళ్లరు... అదే గణితం.
'ఎందుకంత భయం' అంటే...
'బాబోయ్... ఆ పెద్దపెద్ద సూత్రాలు
గుర్తుండవు', 'ఈక్వేషన్లూ
కాలిక్యులేషన్లూ గందరగోళం' అంటూ
సమాధానం చెబుతారు.
అయితే ఈ సూత్రాలను కుదించే
తేలికైన షార్ట్‌కట్‌లు ఎప్పుడో
వేదంకాలం నుంచే ఉన్నాయి.
అదే... వేద గణితం. ఢిల్లీకి చెందిన
ఓ సంస్థ ఈ గణితాన్ని వెలుగులోకి తెచ్చే
ప్రయత్నం చేస్తోంది.



# లెక్కలు సులువే

## 3375 + 4421 = ?

ఈ లెక్క చేయడానికి ఎంత టైం కావాలి? 2 నిమిషాలు... 3 నిమిషాలు... లేదా 5. కానీ, 30 సెకన్లలో పూర్తిచెయ్యొచ్చు! 35ని 35తో గుణించాలన్నా సెకన్లు చాలు. ఇలా ఎన్నో లెక్కల్ని ఎలాంటి యంత్ర సహాయమూ లేకుండా చెయ్యొచ్చు... అయితే, ఆ టిప్స్ తెలియాలి మరి!

'గణితం అంటే భయపడేవాళ్లు చాలా మంది. పిల్లలేకాదు, పోటీపరీక్షలకు హాజరవుతున్నవారిలోనూ ఈ భయముంది. వేద గణితంతో ఆ భయాన్ని దూరం చెయ్యొచ్చు. మేం చేస్తున్న పని అదే' అంటారు ప్రదీప్ కుమార్.

### ఆ పుస్తకం

"ఆధ్యాత్మిక పుస్తకాలు చదవడం నాకు హాబీ. అలాగే ఓసారి ఓ పుస్తకం కొన్నా. చాలా పెద్దది అది. ఏంటా అని చదవడం మొదలుపెట్టాను. అందులో వేద గణితానికి సంబంధించి కొన్ని సూత్రాలున్నాయి. పేజీలు తిప్పుతున్నకొద్దీ వాటిపై ఆసక్తి రెట్టించింది. ఏవో అస్పష్టమైన ఆలోచనలు మొదలయ్యాయి"... అలా 1998లో మ్యాజికల్ మెథడ్స్ ఆవిర్భావానికి దారి తీసిన సంఘటనను వివరిస్తారు ప్రదీప్.

ఇక, ఈ వేద గణితం విషయానికొస్తే... అథర్వణ వేదంలో ఉంది దీని ప్రస్తావన. దానిలో గణితానికి సంబంధించి 16 సూత్రాలు, 13 ఉపసూత్రాలు ఉన్నాయి. 1965 ప్రాంతంలో భారతీకృష్ణ తీర్థ మహరాజ్ వేదగణితంపై ఓ పుస్తకాన్ని రాశారు. ప్రదీప్ చదివిన 'పెద్ద పుస్తకం' అదే. 'ఈ గణితాన్ని ప్రపంచవ్యాప్తం చేస్తే'... అస్పష్టమైన అతడి ఆలోచనలకు ఓ రూపం వచ్చింది. వెంటనే రెండు నిర్ణయాలు తీసుకున్నారు ప్రదీప్. మొదటిది మారుతీ ఉద్యోగ్ లిమిటెడ్‌లో ఉద్యోగానికి గుడ్‌బై. రెండోది ఢిల్లీలో మ్యాజికల్ మెథడ్స్ ప్రారంభం.

### లెక్కల ఆటలు

టవర్ ఆఫ్ హనోయ్... మ్యాజిక్ స్క్వేర్... ఫ్రాగ్స్ అండ్ టోడ్ అండ్ డబుల్ గేమ్... ఇవన్నీ ప్రదీప్ తయారుచేసిన ఆటలు. అంకెలాటలు! వేద గణిత సూత్రాలను వీటిల్లో ఇమిడ్చి విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేట్టుగా కొన్ని పద్ధతులను రూపొందించారాయన. వాటి సహాయంతో వివిధ పాఠశాలలు, కళాశాలల్లో అవగాహనా శిబిరాలు ఏర్పాటు చేయడం ప్రారంభించారు. ఈ ఏడాది ఆసియా, యూరప్, కెనడాలలోని పాఠశాలల్లో 30కిపైగా వర్క్‌షాప్‌లు నిర్వహించారు ప్రదీప్. మనదేశంతో సహా వివిధ దేశాల్లో దాదాపు 57 సెంటర్ల ద్వారా వేద గణితాన్ని నేర్పిస్తున్నారు. అంతేకాదు, మరో వంద మంది వేద గణిత ఉపాధ్యాయులూ 'మ్యాజికల్ మెథడ్స్'లో ఉన్నారు.

'విదేశాల్లో మన వేద గణితానికి ఆదరణ కాస్త ఎక్కువే. ఈ మధ్యే మన దగ్గరా దీనిపై ఆసక్తి పెరుగుతోంది. ముఖ్యంగా ఐఐటీ, క్యాట్, బ్యాంక్ పరీక్షలకు హాజరయ్యేవారు ఈ పద్ధతి ద్వారా లెక్కల్ని సాధన చేయడానికి ఆసక్తి చూపుతున్నారు' అంటారు ప్రదీప్.

3375కి 4421 కలపాలంటే... 3000+4000, తరవాత 300+400, 70+20, 5+1... వీటన్నింటి మొత్తాలను వేలి వేళ్లమీద కూడేస్తే సరి!

$35\times35$... ముందు $5\times5=25$. 3 తరవాత ఎంత... 4 కదా! $4\times3=12$. అంటే 1225 సరైన జవాబు. ఈ సూత్రాన్ని $25\times25$... $45\times45$... $75\times75$లలా దేనికైనా అప్లై చేసుకోవచ్చు...ఇలాంటి తెలివైన పద్ధతులు వేదగణితంలో ఎన్నో! ★

